కిన్నెర

దేశెట్టి కేశవరావ్



"రమా! మిమ్మల్నెవరో ఫోనులో పిలుస్తున్నారు!" కౌంటరు దగ్గర్నించి శశికళ ఇంగ్లీషులో అరిచింది.

"ఒక్క నిమిషం!" రమ షోకేసు అద్దంమీద పెట్టివున్న చందనం వస్తువుల్ని తిరిగీ లోపల సర్దుతూ అంది. అన్నిటినీ లోపల వుంచేసి, స్లైడు డోరు లాగేసి పరుగెత్తుకుంటూ కౌంటరు దగ్గర కొచ్చింది. బల్లమీద వుంచిన రిసీవర్ని చేతిలోకి తీసుకుని "రమా హియర్!" అంది. కాసేపు విని "ఓ, బావా! నువ్వేనా, ఏమిటి విశేషాలు?" అంది.

టెలిఫోను ఆమె చెవిలో కాసేపు గుసగుసలాడింది. "ఓ దానికేం భాగ్యం! అంత డబ్బు దొరికినప్పుడు అలాగే చేద్దువుగానిలే!" అంది. మరికొంతసేపు విని, "నువ్వు నిజంగా అంత గొప్పవాడివైతే మేము గుర్తుంటామా?" అంది.

తర్వాత ఫోను ఏం చెప్పిందో ఫకాలున నవ్వేసి "అలాగే, అలాగే!! చూడూ, యిప్పుడు చాలా బిజీగా వున్నాను. పీక్ అవర్! మాటిమాటికీ యిలా ఫోను చెయ్యకేం? వుంటానూ! మళ్లీ కలుసుకుందాంలే!" అనేసి, ఫోను క్రేడిల్‌లో వుంచేసింది.

శశికళ కనుబొమలెగరేసి ప్రశ్నార్థకంగా రమకేసి చూసింది. "ఏముందీ? మామూలే. మా బావకి మళ్లీ గొప్ప అయిడియా ఒకటి తట్టింది. డెబ్బై వేలుంటే ప్లాస్టిక్ పైప్స్ యిండస్ట్రీ పెడతాడట. ఇప్పటికి అయిదు వందలు మాత్రం సమకూర్చాడు!" అని వివరించింది రమ.

శశికళ మధురంగా నవ్వింది. "అయితే త్వరలో మాకు పప్పన్నం పెడతావన్నమాట!" అంది.

"అలాగే! అయిదు వందల పక్కన సున్నాలు చేరాలిగా! అవి చేరేసరికి నా పెళ్లిమాట కూడా సున్నా అయ్యేలాగుంది!" అని నవ్వేసింది రమ.

"అదుగో, అక్కడ తెల్ల చర్మంవాళ్లొచ్చారు. అమెరికన్లలాగుంది. ఇప్పుడొక అయిదు వందలకన్నా బిల్లు తప్పదు. గంటసేపు వాళ్లతో భేటీ తప్పదు!" అని విసవిసా తన సెక్షన్‌వేపు నడిచింది.

ఇద్దరు అమెరికన్లు — భార్యా భర్త — ఒక కుర్రాడు, వాళ్లబ్బాయి కాబోలు, తన సెక్షన్ దగ్గర వేచివున్నారు, షో కేసులోని వస్తువుల్ని చూస్తూ వాళ్లు కుతూహలంగా ప్రశ్నలడుగుతోంటే, అన్ని వస్తువులనీ చూపిస్తూ, వాటి వివరాలను తెలువుతోంది రమ. ఒక్కొక్క వస్తువునే జాగ్రత్తగా పరిశీలిస్తూ, వాళ్లు కావలసినవాటిని ఎంపిక చేసుకుంటున్నారు.

"మిస్ రమా! ఈ రోజు మానెక్విన్‌కి డెకొరేషన్ మార్చలేదేం!" మానేజర్ కామరాజు కంఠం హటాత్తుగా వినిపించింది.

రమ అతడి కంఠం విని తత్తరపడిపోయింది. తమాయించుకుని, "రొటేటింగ్ టేబిల్ చెడిపోయినట్టుంది సార్!" అంది.

"మరి మెకానిక్‌కి ఫోన్ చేశారా?" కామరాజు కంఠం కర్కశంగా ధ్వనించింది.

రమ మరింత గాభరా పడిపోయింది. కామరాజు అవసరమైతే ఎంత కఠినంగానైనా వుండగలడు. "లే...లే...లేదు సార్! పొద్దుటినించీ చాలా బిజీగా వున్నాను!" అంది రమ.

"ఐ డోంట్ వాంట్ ఎక్స్క్యూజెస్. అంతా స్మార్ట్‌గా జరగాలి. సేల్స్ ఇంప్రూవ్‌మెంట్ చూపించకపోతే 'కిన్నెర' క్లోజ్ చేస్తారు. అంటే తెలుసుగా! మీకూ, నాకూ వుద్యోగం వూడుతుంది!" అన్నాడు కామరాజు.

"ఐ విల్ అటెండ్ టూ యిట్ ఇన్ వన్ మినిట్ సార్!" రమ అమెరికన్లని వదిలేసి కౌంటర్ దగ్గరికి పరిగెత్తింది.

"మళ్లీ ఏమయిందేమిటి?" శశికళ అడిగింది.

"మళ్లీ... మళ్లీనా?... ఏముంది? మెకానిక్‌కి ఫోను చెయ్యాలి!" అంది రమ.

"నీ కభ్యంతరం లేకపోతే నేను చూస్తా నమ్మాయ్!" అన్నదో ముసలి కంఠం.

శశికళ కళ్లు విప్పార్చి ఆ ముసలివాణ్ణి చూసింది. "మన పాకెట్‌మార్ రిపేరు చేస్తా డటోయ్!" అంది రమతో లోగొంతుకలో.

నీట్సైన దుస్తులు వేసుకుని, దర్జాగా అటూ యిటూ తిరుగుతున్న ధనవంతులలో బాగా మాసిన బట్టలు వేసుకుని, తెల్లటి గడ్డం చివర చొక్కా మీద వణుకుతుండగా ముందుకి వస్తున్న ఆ విగ్రహం విచిత్రంగా వుంది చూట్టానికి. రమ అతణ్ణి చూసి, "మీరా, తాతయ్యగారూ! ఎప్పుడు వచ్చారండీ! నేను చూడనేలేదు!" అంది.

"నీకు మీ బావ దగ్గర్నుంచి ఫోన్ వచ్చినప్పుడే వచ్చానమ్మా!" అన్నాడా వృద్ధుడు.

"అలాగా! మీకేం కావాలో చెప్పండి. ఒక్క అయిదు నిమిషాల్లో తీసి యిస్తాను!" అంది రమ.

"నాకేం తొందర లేదులే అమ్మాయ్! ముందా రిపేరు సంగతి చూడనీయ్!" అన్నాడు ముసలాయన.

"సారీ, తాతయ్యగారూ! కస్టమర్సుతో పని చేయించుకోవడం..."

"ఫరవాలేదులే, అమ్మాయ్! ఒక్క క్షణంలో సరిచేస్తాగా!" అన్నాడతడు.

"యీ ముసిలాడు వదిలేట్టులేడు! పద, మరి!" అంది శశికళ రమతో, రహస్యంగా.

కుర్రాడి సాయంతో రమ మానెక్విన్‌ని తీసి పక్కకి వుంచింది. ముసలాడు వంగి, టేబిల్‌తో కుస్తీ పడుతున్నాడు. రమ తిరిగి తన సెక్షన్ దగ్గరకి పరుగెత్తుకుంటూ వచ్చింది. అమెరికన్లు ఎంచుకోడం అయింది. వాళ్ల వస్తువులన్నీ జాగ్రత్తగా ప్యాక్ చేసి, బిల్లు వేసి యిచ్చింది. తొమ్మిది వందల యాభై యేడు రూపాయలా పద్దెనిమిది పైసలయింది. అతను వెయ్యి రూపాయలు యిచ్చి "కీప్ ది ఛేంజ్" అన్నాడు.

"సారీ, నో టిప్పింగ్ హియర్!" అంది రమ. పనివాణ్ణి పిలిచి బిల్లునూ డబ్బునూ శశికళకి పంపించింది.

రమ మాటలకి అతడు ఆశ్చర్యంతో నీలం గుడ్లు పెద్దవి చేసి చూశాడు. "కిన్నెర అంటే ఏమిటి?" అని అడిగింది అమెరికా వనిత.

చెమట పైటకొంగుతో తుడుచుకుంటూ "మా షాపు పేరు!" అంది కాస్తంత విసుగులోచే స్వరంతో.

"అది సరే! దానికేమీ అర్థం లేదా?" అని అడిగిందావిడ.

"ఒక రకమైన ఏంజెల్" అంది రమ.

"అంటే గార్డియన్ ఏంజెలా?"

"ఆఁ! ఆఁ! అలాటిదే!" అంది రమ ఏమనాలో తెలియక.

ఇంతలో కుర్రాడు చిల్లర పట్టుకొచ్చాడు. చిల్లరా, బిల్లూ వాళ్లకిస్తూ "థాంక్యూ, వెరీమచ్! ప్లీజ్ విజిట్ అవర్ ఎంపోరియం అగైన్" అంది.

"థాంక్యూ! యూ ఆర్ స్వీట్ గర్ల్!" అన్నాడతడు, వెళ్లిపోతూ.

"థాంక్యూ! థాంక్యూ!" అని మిగతా యిద్దరూ నిష్క్రమించారు అతడితోపాటే.

"రెడీ!" అని అరిచాడు టర్న్‌టేబిల్ దగ్గర్నించి ముసిలాడు. ఇంతలో మరో నలుగురు రమ సెక్షన్ దగ్గరకొచ్చారు. 'జస్టే మినిట్' అని వాళ్లతో చెప్పి ముసలాయన దగ్గరికి పరిగెత్తింది.

"చూశావా, అమ్మాయ్! రెడీ అయిపోయింది!" అన్నాడతడు. స్విచ్చి వేస్తే టేబిల్ తిరుగుతోంది. స్విచ్ ఆఫ్ చేసి, కుర్రాడి సాయంతో మానెక్విన్‌ని దానిపై వుంచి మళ్లీ స్విచ్ వేసింది. ఈసారి బొమ్మ వయ్యారంగా, మెల్లగా తిరుగుతోంది.

"థాంక్యూ వెరీమచ్ తాతయ్యగారూ!" అంది రమ.

మైలపట్టిన చేతులు పాంటుకు రాసుకుంటూ "ప్రాణమున్న ఆడబొమ్మల్ని ఆడించడం మగవాళ్లకి సరదా! ప్రాణం లేని ఆడబొమ్మల్ని ఆడించడంకూడా సరదాయే!" అన్నాడాయన. రమ నవ్వింది

"నువ్వు కాస్త జాగ్రత్తగా వుండమ్మాయ్! లేకుంటే మీ బావ కూడా నిన్ను యిలాగే ఆడించగలడు!" అన్నాడు. రమ చురచురా అతడివంకకి చూసింది.

"సర్దుకన్నా నమ్మాయ్! కోపం తెచ్చుకోకు!" అన్నాడు ముసలాయన నవ్వుతూ.

రమ మెల్లిగా నవ్వింది. "లేదండీ, తాతయ్యగారూ! పెద్దవారు మీరు! హాస్యమాడినంత మాత్రాన కోపం ఎందుకు? పైగా మీరు ఇవ్వాళ నా కింత సాయం చేశారు: కాబట్టి యీ రోజు మీకు స్పెషల్ డిస్కౌంటు యిప్పిస్తాను. టెన్ పర్సెంట్ ఆఫ్! ఉండండి, కుర్రాడితో మిమ్మల్ని టాయ్సు సెక్షన్‌కి తీసికెళ్లమంటాను. మీరు చూస్తూవుండండి! నేను వాళ్లని అటెండ్ అయి వస్తాను. నేను వచ్చేంతవరకూ ఏమీ కొనకండేం!" అని, కుర్రాణ్ణి పిలిచింది.

"ఒద్దులేమ్మాయ్! నేను ప్రతి నెలా వచ్చేవాణ్ణే కదా! నాకు కొత్తేం వుంది? పైగా నీకోసం అది రిపేరు చేశాను. నా బడ్జెట్టు మామూలే. యాభై రూపాయలు. నాకేం డిస్కౌంటు వద్దు!... నువ్వు వచ్చేవరకూ అక్కడే వుంటాను!" అన్నాడు ముసలాయన. వెనక్కి తిరిగి రమని చూసి, చిరునవ్వు నవ్వేసి, మెట్లవేపు నడిచాడు.

రమ తన సెక్షనువేపు గబగబా నడిచింది. కౌంటరు దగ్గర పని లేకపోవడంతో శశికళ రమ సెక్షను దగ్గరకొచ్చి, కస్టమర్సుకు వాళ్లకి కావలసిన వస్తువులు చూపిస్తోంది.

"రక్షించావు తల్లీ!" అంది రమ.

"ఏమంటున్నాడేమిటి మీ ముసలినేస్తం?" అనడిగింది శశికళ.

"మామూలే! ఏదో తేదీగా! బొమ్మలు కొనుక్కెళ్లడానికి వచ్చాడు! ఎవరికిస్తాడో ఆ బొమ్మల్ని?" అంది రమ

ముఖం అసహ్యంగా పెడుతూ అంది శశికళ, "ఎవరికిస్తాడో ఏమో! మాసిన బట్టలు వేసుకుని, మన షాపులోకి వస్తుంటే, యిలాటి కస్టమర్ను చూసి నాకే సిగ్గు వేస్తుంది ఎక్కడో పాకెట్‌మార్ చేస్తాడు, బొమ్మలు కొనుక్కెళ్తాడులావుంది!"

"ఛ ఛ! అలాగనుకోను!" అంది రమ.

"నువ్వంతేలే! నీ ఫ్రెండుగామరి!" అంది శశికళ. ముసలాయన వచ్చినప్పుడల్లా యీ సంభాషణ సాగుతూనే వుంటుంది వాళ్లిద్దరిమధ్యా.

టర్న్‌టేబిలుమీద ఆడబొమ్మ మెల్లగా తిరుగుతున్నట్టు ఆమె మనసు మెల్లగా గతంవేపు తిరిగింది. వ్యాపారం పెంచడం కోసం వున్న వూరు విశాఖపట్నాన్ని వదిలి నాన్న హైదరాబాదుకు మకాం ఎత్తేశాడు. పుట్టి పెరిగిన వూరుని వదిలివెళ్తుంటే రమకి కన్నీళ్లు ఆగలేదు. తర్వాత్తర్వాత హైదరాబాదు వాతావరణానికి అలవాటయిపోయింది. చిన్నతనంలో నయితే బావకి వారానికొక ఉత్తరం వ్రాసేది. అత్తయ్యావాళ్లు విశాఖలోనే వుండిపోయారు. నాన్నగారికి వ్యాపారంలో నష్టం రావడమూ, ఆయన గుండెపోటుతో అకస్మాత్తుగా పోవడమూ, కొంపా గోడూ అమ్మి తలకొక దారిగా విడిపోవడమూ — అదంతా ఒక పీడకల. పెద్దన్నయ్య ఏదో వుద్యోగంలో వున్నాడు. అమ్మని తీసికెళ్తూ తననికూడా రమ్మన్నాడు. తనకే వాడితో వెళ్లడానికి యిష్టం లేకపోయింది. నాన్నగారుండగా సరదాకని 'కిన్నెర' చేతిపనుల షాపులో చేరిన వుద్యోగం, ఇప్పుడు తనకి ఆధారమైంది. వర్కింగ్ వుమన్స్ హాస్టల్లో వుంటూ కాలం గడిపింది.

తనకి విశాఖపట్నానికి బదిలీ అయిందని తెలియగానే, రమకి సంతోషమూ దుఃఖమూ కలిగాయి. తమది పెద్ద వ్యవస్థ. దేశం మొత్తం మీద లెక్కలేనన్ని షాపులున్నాయి. ఆంధ్రలోనయితే హైదరాబాదు, ఖమ్మం, కాకినాడ, అనంతపురం, విశాఖపట్నాలలో బ్రాంచిలున్నాయి. హైదరాబాదులో వున్నంతకాలం, ఒంటరిగా వుండినా, మంచిర్యాలలో పనిచేస్తున్న అన్నయ్యకీ, తన దగ్గరున్న అమ్మకీ దగ్గరగా వున్నాననే భావం వుండేది. కాని యిప్పుడు విశాఖపట్నం వెళ్లాలనేసరికి, తన వాళ్లందరికీ దూరమైపోతున్నానన్న దుఃఖం ముంచుకొచ్చింది. అయితే అందులోనే ఒక సంతోషం. చిన్నప్పుడు పుట్టి పెరిగిన వూరికి వెళ్తున్నాననే ఆనందం. చిన్నప్పటినుంచీ చూడని అత్తయ్యనీ, బావనీ చూడొచ్చని సంతోషం, అందుకే 'కావాలంటే ఖమ్మంకి బదిలీ చేస్తాం' అని ఆఫీసువాళ్లు అన్నా, వద్దని విశాఖపట్నానికే వచ్చేసింది. అన్నయ్య వుద్యోగం మానేసి యింటికి వచ్చెయ్యమని బతిమాలుకున్నా వినక మొండికెత్తి విశాఖకి వచ్చింది.

వాల్తేరులో రైలు దిగి రిక్షా దగ్గరకు వచ్చింది. ఆశ్చర్యంతో ఆమె కళ్లు విప్పారాయి. మత్తుగా, ఎక్కువ జనసంచారం లేని వాల్తేరు ఇప్పుడు కళకళలాడుతోంది. కొత్త కొత్త రోడ్లు, వినూతనమైన కట్టడాలు. 'ఇది తను ఎరిగిన వాల్తేరేనా?' అని విస్తుపోయింది. పర్సులో అన్నయ్య దగ్గర తీసుకున్న అత్తయ్యావాళ్ళ అడ్రసు తీసి రిక్షావాడికి చెప్పింది. రిక్షాలో వెళ్తూ ఆశ్చర్యంగా వూరంతా పరికించింది.

"ఇటు కాదోయ్! కె. జి. హెచ్. డౌనుకి!" అంది రిక్షావాడితో.

"ఇదేనండీ కేజీ డౌను!" అన్నాడు రిక్షావాడు.

ఊరెంతో మారిపోయిందని గుర్తించింది.

(31 వ పేజీ చూడండి)

తర్వాత తనకి తెలిసిన ప్రదేశాలన్నీ చూసి, ఇది తనకు తెలిసిన పట్టణం కాదని గమనించింది. టౌనుహాలు దగ్గర చిందులేస్తూ కేరింతాలుకొట్టే సముద్రపుటల లేవీ? తనకి బాగా గుర్తున్న వీధులేనా యివి? తను చదువుకున్న క్వీన్‌మేరీస్ మాత్రం మారలేదు. అసలు పాత పోస్టాఫీసు నుంచి, హిందూ రీడింగు రూం వరకూ ఏమీ మారలేదు. ఆ తరవాతదిమాత్రం, తనకు తెలిసిన వూరు కాదు. అదొక నూతన నగరం. నాగరికత సృష్టించిన కొత్త ప్రపంచం. వీటన్నిటిమీదా ఇనుప నాగులాగా చుట్టుకుంటూ హార్బరులోకి వెళ్ళే ఇనుప ఖనిజపు కన్వేయరు.

అత్తయ్యా వాళ్ళింట్లో తను రెండురోజు లుంది. బి. ఇ. అయినా బావకి వుద్యోగం లేకపోవడం, చిన్న చిన్న వుద్యోగాలు చెయ్యడం బావకి యిష్టం లేకపోవడం, వాళ్ళింట్లో యిబ్బందులు — రమకి బాధని కల్గించాయి. బావని పెళ్లి చేసుకుని, హాయిగా తన యింటిని చక్కబెడుతూ కూర్చోవాలనే భావం కలగకపోలేదు. కానీ, స్వంత వ్యాపారం చేసి, ఉన్నతస్థితికి వచ్చాక గాని, పెళ్లి మాటలు తలపెట్టేది లేదని బావ ఏదో మాటల సందర్భంలో అన్నది విని, తన అభిప్రాయం మార్చుకుంది. బావ సాయంతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టలులో సీటు సంపాదించి దానిలో చేరిపోయింది, అత్తయ్య వద్దంటున్నా వినకుండా. అయితే రోజుకి రెండుసార్లయినా బావ ఫోను చేస్తుంటాడు. అప్పుడప్పుడూ కలిసి రామకృష్ణా బీచి దగ్గరకి షికార్లకి వెళ్తుంటారు. పది పదిహేను రోజులకోసారి పళ్లు తీసుకొని, అత్తయ్యావాళ్లింటికి వెళ్తుంటుంది. ఆ రోజు రాత్రికి అక్కడే భోంచేసి, హాస్టలుకి తిరిగి వస్తుంటుంది.

తను చేరిన రెండోరోజునే షాపులో 'పాకెట్ మార్' అనే ముద్దు పేరు పెట్టిన ముసలాయన్ని చూసింది. మాసిన బట్టలతో జంకూగొంకూ లేకుండా, షాపులోకి వస్తున్న అతణ్ణి చూసి, తను భయపడింది. గబగబా అతడి దగ్గర కెళ్లి "చూడండి! ఇది చేతి పని వస్తువులు అమ్మే దుకాణం! మీకు కావలసినవి ఏవీ యిక్కడ దొరకవు!" అంది.

"నాకు బొమ్మలు కావాలి. ఆటబొమ్మలు!" అన్నాడతను.

"దొరుకుతాయికానీ చాలా ఖరీదు!" 'చా'ని దీర్ఘంతీస్తూ అంది. ముసలాయన నవ్వాడు. "నువ్వు కొత్తగా వచ్చావా అమ్మాయ్!" అని అడిగాడు.

"అవు" నన్నది.

"నాదగ్గర యాభై రూపాయలు వున్నాయ్!" అన్నాడతను జేబులో చెయ్యి పెట్టుకుంటూ.

తనే మనలేక వెనక్కితిరిగి వచ్చేసింది. తర్వాత తెలిసింది, అతడు ప్రతినెలా వచ్చి బొమ్మలు కొనుక్కొని వెళ్తుంటాడని. చూడడానికి పేదవాడు లాగా కనిపించే అతను ప్రతినెలా యాభయి రూపాయల ఆటబొమ్మలు - చాలా ఖరీదయిన బొమ్మలు — కొనుక్కెళ్లడం రమకి విచిత్రంగా కనిపించింది.

ఢిల్లీలో జరిగిన 6వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాల్గొన్న బ్రిటిష్ చిత్రం బ్యారీ లిండన్‌లో ఒక దృశ్యం

కిన్నెర

(25 వ పేజీ తరువాయి)

ఎవరో ఏదో అడుగుతున్నారు.

"ఏమిటండీ?" అనడిగింది రమ, వర్తమాన పరిజ్ఞానం కలిగించుకుని.

అతనడిగిన దానికి "అది ఐవరీ ఇన్‌లే వర్క్ అండీ. చాలా పాణ్యమైంది. చెదరదు" అంది.

"అదికాదండీ, ఇది" అతడు మరో బొమ్మని చూపించాడు.

"గీతోపదేశమండీ! అది ప్యూర్ ఐవరీ. ఇక్కడ తయారైందే!" అన్నది.

"ఖరీ దెంతండీ?"

యాంత్రికంగా జవాబు చెప్పి "తల్లీ, నువ్విక్కడ కాసేపుండు! నేను ఒక్కక్షణంలో వస్తాను!" అని శశికళతో అంది.

"టాయ్స్ డిపార్టుమెంటుకేనా? వెళ్లిరా!" అంది శశికళ.

మెట్లెక్కి గబగబా మేడమీదకి వచ్చి ఆటబొమ్మల విభాగంవేపు నడిచింది. తీరిగ్గా ముసలాయన బొమ్మల్ని పరిశీలిస్తున్నాడు.

"తాతయ్యగారూ! సెలక్షన్ అయిందా?" అని అడిగింది రమ.

"ఏదమ్మా! నువు వస్తానన్నావుగా! అందుకే వూర్కున్నాను" అన్నాడాయన.

త్వర త్వరగా నాలుగైదు బొమ్మల్ని ఏరి, పాక్ చెయ్యమంది. పాక్ చేస్తుంటే "చూడండి, ఈయన మన రెగ్యులర్ కష్టమర్. పది పర్సెంటు వారికి డిస్కౌంటు యివ్వాలి!" అంది సేల్స్‌మెన్ చంద్రంతో.

"సారీ! అవి లేటెస్టు స్టాకు. దానిపై డిస్కవుంటు కుదరదు!" అన్నాడు చంద్రం.

రమ ముఖం ఎర్రబడింది. "ఎందుకు కుదరదు? ... పైగా ఆయన మనకి ఇవేళ చేసిన సహాయం తెలుసుకుంటే..." మాటలు కోపంలో తడబడ్డాయి.

"ఆ విషయం మీరు మేనేజరుగారితో మాటాడండి. ఆయన ఒప్పుకుంటే నాకే అభ్యంతరమూ లేదు!" అన్నాడు చంద్రం.

ముసలాయన ఆమె దగ్గరగా వచ్చాడు. "కోప్పడకమ్మాయ్! నాదగ్గర యాభై రూపాయ లుందిగా!" అన్నాడు అనునయంగా చూస్తూ. "ఏదీ బిల్లు యిలాతే!" అని తీసుకుని, బొమ్మల ప్యాకెట్టునుకూడా తీసుకొని, రమతో కలిసి క్రింది కొచ్చాడు.

"వస్తానండీ!" మెట్లు దిగాక నమస్కారం చేసింది రమ.

"నువ్వు బాధపడకమ్మాయ్! నాకు డిస్కవుంటు వద్దని ముందే చెప్పాగా!" అన్నాడతను. ఆమెవేపు చూసి నవ్వి, తల పంకించి, కౌంటరువేపు సాగిపోయాడు.

* * *

కొన్నాళ్ళ తరువాత —

షాపు మూసేశాక, హ్యాండుబాగు తీసుకొని, శశికళకి గుడ్‌బై చెప్పి, అప్‌లాండ్సువేపు నడుచు కుంటూ బయలుదేరింది రమ. కొంతదూరం నడిచాక, ముందు మెల్లగా సాగిపోతున్న ముసలాయన్ని చూసింది. నడక వేగం హెచ్చించి, అతణ్ణి వచ్చి కలుసుకుంది.

"నమస్కారం తాతయ్యగారూ!" అంది.

అతను తలతిప్పి చూసి "ఓ నువ్వా అమ్మా!... ఏమిటి యీరోజు ఏమీ ప్రోగ్రాం లేదా?" అనడిగాడు.

"ఎందుకులేదండి? మా బావ స్కూటర్ తెస్తానన్నాడు. అలా యూనివర్శిటీవేపు వెళ్లొస్తాం!"

"అబ్బ! స్కూటర్ కొనేశాడేమిటి?"

"లేదండీ! ఎవరో ఫ్రెండు దగ్గర అరువుకి తీసుకొస్తానన్నాడు. వట్టినే సన్నలా తిప్పడానికి!" నవ్వేసింది.

"బాగుందమ్మా!" అన్నాడు ముసలాయన.

"అవునూ! చేతిలో ఏమిటో పాకెట్ పట్టుకున్నారు? బొమ్మలు కాదుగదా!" అనడిగింది.

"అబ్బే! బొమ్మలుకావు తల్లీ! బట్టలు! రేపు నా పుట్టినరోజు. అందుకే ఇంట్లోవాళ్లంతా బలవంతంచేస్తే కొన్నాను!" అన్నాడు, పాకెట్ గాలిలో ఆడించి, రెండోచేతికి మార్చుకుంటూ.

"భేష్! ఇన్నాళ్లకి ఒక మంచిపని చేశారండీ!" అంది రమ.

"ఏం? రేపు నేను కొత్తబట్టలు వేసుకుంటే జపాన్‌లో భూకంపం వస్తుందంటావా?" అని నవ్వాడు. "ఏం చేసేది తల్లీ! అలవాటు! ఎన్నో సంవత్సరాలు మెకానిక్‌గా పని చేశాను. అన్నిరకాల పనులూ నేర్చుకున్నాననుకో. అప్పటి అలవాటు. కొత్తబట్టలు వేసుకుంటే నాకదోలా వుంటుంది!" అన్నాడు.

హటాత్తుగా రమ నేలవంకకి చూసింది. అతడి కాళ్లకి జోళ్ళు లేవు. "తాతయ్యగారూ! రేపు పది గంటలకి మీరు షాపుకి ఒకసారి రాగలరా?" అనడిగింది.

"ఎందుకూ?"

"వూరికేనండి! రాగలరా?"

"ఏమిటి? కొత్తబట్టలు వేసుకునేనా?"

"అవునండీ! మిమ్మల్ని ఆ బట్టల్లో చూస్తే

మావాళ్లంతా మురిసిపోతారు. తప్పక రావాలిసుమా!"

ముసలాయన నవ్వాడు. "సరేనమ్మా! నువ్వు చెప్పాక తప్పుతుందా?"

దూరంనించి చప్పట్లు వినిపించాయి. ముసలాయన వెనక్కి తిరిగాడు. రమ కూడా తిరిగింది.

పరుగెత్తుకుంటూ గోపాలం వచ్చాడు. "అబ్బ! ఎంతదూరం నించి మీ వెనక పరుగెత్తుకుంటూ వస్తున్నానో తెలుసా?" అన్నాడు.

"ఎందుకూ పరుగెత్తుకురావడం? స్కూటరు తెస్తానన్నావుగా!" అంది రమ.

"వద్దులే రమా! తెద్దామనుకున్నానుగానీ, అరువు సొమ్ము బరువుచేటని తేలేదు!" అన్నాడు గోపాలం.

"బాగా చెప్పావు నాయనా! నువ్వు నాకు నచ్చావు!" అన్నాడు ముసలాయన.

గోపాలం ప్రశ్నార్థకంగా ఆయనవంక చూశాడు ఎవరన్నట్టు. రమ "తాతయ్యగారూ! యీయనే మా బావ గోపాలం! బావా! ఈయనా...మాషాపు కొస్తుంటారు!" అంది ఆయన్నెలా పరిచయం చెయ్యాలో తెలియక.

"పేరేదైతేనేం నాయనా! 'కిన్నెర'లో అంతా నన్ను 'పాకెట్‌మార్' అంటుంటారు" అన్నాడాయన నవ్వుతూ.

"అరే! మీకు తెలుసన్నమాట!" రమలో ఆశ్చర్యం.

అతడు నవ్వుతూ తల పంకించాడు. "కుర్రాడివి గాబట్టి మరదల్ని సరదాగా స్కూటర్‌మీద షికారుకి తీసుకెళ్లాలని అనుకున్నావనుకో. దాంటో తప్పులేదు. కానీ, యీరోజు నువ్వు ఆ స్కూటరే గనక తీసుకొచ్చివుంటే, నీపై నాకు సదభిప్రాయం కలగకపోను!" అన్నాడు.

"అంతేనండి!" అన్నాడు గోపాలం. "నేను స్కూటర్ కొనే రోజు ఎంతోదూరంలో లేదండి! స్కూటరేం ఖర్మ! దేవుడు దయదలిస్తే!... అయితే ఒక్క డెభ్భైవేలు పెట్టుబడి కావాలండి!... ఏ బాంకువాళ్లయినా అంత మదుపు పెట్టడానికి జంకుతున్నారండి!"

"పోనీ! డబ్బు దొరకడం సాధ్యంకానప్పుడు వుద్యోగం చూసుకుంటే పోలా!" అన్నాడు ముసిలాయన.

"అబ్బే! వుద్యోగం అంటే నా కిష్టం లేదండి! బానిసత్వం కాదుటండీ! హాయిగా యిండస్ట్రీ పెట్టుకోవాలండీ!"

"నీ ఊహ బాగానేవుంది నాయినా! కాని ఆధారంలేకుండా కలలుగనడం, నిచ్చెన లేకుండా స్వర్గానికి ఎగబ్రాకడంవంటిదికదా!"

"అదేనండి నా దుగ్ధ. కానీ యీ యిండస్ట్రీ చాలా గొప్పది. ఆరువందలు పెట్టి ప్రోడక్టు, మార్కెటింగు సర్వే చేయించాను. మూడేళ్ళలో అప్పు తీర్చేసి, ఇంతకింతా మిగిలించుకోవచ్చును." కుతూహలంగా అన్నాడు గోపాలం.

చిన్నపిల్లాడిలా, ఉద్వేగంగా మాట్లాడే గోపాలాన్ని ఆదరంగా చూశాడు ముసిలాయన. "నీ కలలు కల్లలు కాకూడదని కోరుకుంటున్నాను నాయనా! కానీ ఆలోచించు. అందే స్వర్గాన్ని ఆశించడం మేలుగాని..."

"నా శక్తిమీద నాకు నమ్మకం వుందండీ! యింత విశ్వాసాన్ని కాపాడేటందుకైనా ఏ దేవతలో దిగివచ్చి కరుణించకపోరు!" అన్నాడు గోపాలం.

"వెర్రిమొర్రి కలలు!" అని గొణుక్కున్నాడు ముసిలాయన. "సరేనమ్మా! నే వస్తాను! మీరలా వెళ్తారేమో వెళ్లిరండి!" అన్నాడు.

"తాతయ్యగారూ! రేపుదయం షాపుకి రావడం మరువకండి!" అంది రమ.

"అలాగే" నని వెళ్లిపోయాడతడు.

అతడు వెళ్లాక, "ఆయన చెప్పినట్టు ఉద్యోగం చూసుకోరాదూ! డ్రైడాక్‌లో ఏదో వుద్యోగం వున్నదన్నావుగా!" అంది రమ.

"అది యీ జన్మకి సాధ్యపడదు!" అన్నాడు గోపాలం.

"అయితే యిక నేను నీతో రాను ఫో!" అంది రమ.

"అదేం?"

"అదంతే! యీ జన్మాని కింతే!" ముఖం ఎర్రగా చేసుకుని అంది.

ఆంధ్రపత్రిక
దినపత్రిక
ఆదివారం
అనుబంధంలో
ఎన్నో మార్పులు
ఎన్నో కొత్త శీర్షికలు!
చూశారా!

గోపాలం నవ్వాడు. "అంత సులభంగా వదుల్తాననుకున్నావా? ఏనాటికైనా నిన్నే పెళ్లి చేసుకునితీరాలని ఎప్పుడో అనుకున్నాను."

"ముసలిదాన్నయాక పెళ్లి చేసుకుంటావా?" అడిగింది రమ.

"అంత ఆలస్యం కాదనుకుంటా! దేవుడు దయదలిస్తే త్వరలోనే అవుతుంది.'

"చూద్దాం!" అంది రమ, నిర్లిప్తంగా ముందుకి నడుస్తూ.

* * *

"ఏమోయ్, శశీ! నీ చేతిచలవ మంచిది. బోణీ చెయ్యవోయ్!" అంటూ రమ కౌంటర్ దగ్గరకొచ్చింది.

ఆరోజు షాపు నిర్మానుష్యంగా వుంది. సేల్స్‌మన్ తమ తమ డిపార్టుమెంటుల్లో షోకేసు అద్దాల్ని తళతళలాడేలా తుడుస్తూ కూర్చున్నారు. కౌంటరు దగ్గర శశి ఇంగ్లీషు నవల తిరగేస్తోంది.

"ఏమిటో విశేషం?" అంది శశి, నవలలోంచి తల పైకెత్తి.

"మన తాతయ్యగారి పుట్టిన రోజట ఈవేళ. పది గంటలకి రమ్మన్నాను. వస్తే ఆయనకి మనమంతా కలసి ఒక చిన్న బహుమతి యివ్వాలని వుద్దేశం!" అంది రమ.

"ఎవరికీ మన పాకెట్ మార్‌కేనా?"

"ఛ ఛ! మాటి మాటికీ అలాగనకు శశీ! ఆయన మనకి కస్టమర్. నెల నెలా మన షాపులోనే కొంటుంటాడు. పైగా పెద్దవాడు ఆయనకో చిన్న ప్రెజెంట్ యిస్తే మునిగేదేముంది?"

"ఏం ప్రజంట్ యిస్తే బావుంటుందబ్బా? ఒక 'టై' కొనిద్దామా?" అనడిగింది పెంకిగా శశికళ.

"ఆయనకి గడ్డం వుందిగా?"

"పోనీ హాండ్‌లూం బనియను కొనిస్తేనో?"

"ఛ ఛ! అది అంత బావుండదనుకుంటా. ఒదీగాక ఆయిన నిన్న కొత్తబట్టలు కూడా కొనుక్కున్నాడు" అంది రమ.

"గ్రేట్! కొత్తబట్టల్లోనే యిక్కడికి వస్తాడన్నమాట. అయితే తప్పక అతడికి బహుమతి యివ్వాల్సిందేనోయ్!"

"అందుకే మంచి హాండ్‌మేడ్ జోళ్ల జత యిద్దామని వుంది. నువ్వు బోణీ చేస్తే నేను వెళ్లి అందర్నీ అడుగుతా!"

"ఓకే! ఇదుగో నావి రెండు రూపాయలు!"

ఇంతలో ఒక్కొక్కరే కౌంటరు దగ్గర గుమిగూడారు. అంతా విని "మన పాకెట్‌మార్‌కా తీసుకోండి! నావి రెండు" అన్నాడు విక్టర్. అలాగా పద్దెనిమిది రూపాయలు వసూలయింది.

"ఇంక మానేజరొక్కడు మిగిలాడు. ఆయన దగ్గరికే వెళ్లొస్తా!" అని బయలుదేరింది రమ.

"వుండవే తల్లీ. 'మై అరైవింగ్'గా వొచ్చాడు!" అంది శశి. అంతా నవ్వారు.

"వచ్చాంరా, భగవంతుడా!" అని స్టూలుమీద కూర్చుంది రమ. రెడ్‌శాండర్స్‌తో చేసిన వస్తువులు టోకున అమ్మడానికి పార్వతీపురం నుంచి ఒక డొస్తుంటాడు. వచ్చినప్పుడల్లా యింగ్లీషులోనే మాట్లాడుతుంటాడు. "మై అరైవింగ్ ఫెల్యువరు మానేజరూ!" అని దీర్ఘాలు తీస్తాడు. "ఐ వరీ వర్కు సార్ ఆల్సో అవేలబుల్. వండర్‌ఫుల్ కేను వర్కు సార్. ఆల్ అవేలబుల్. హౌ మచ్ యూవాే? ప్రైస్ సూటబుల్, ఐయామ్ సెల్లింగ్. నాట్ సూటబుల్ ఐయామ్ గోయింగు" అంటూ మానేజరుతో మాట్లాడతాడు. జింకిణీలాగా ఓ పట్టాన మాటలు తెగనివ్వడు. వాడికి వాళ్లంతా ముద్దుగా "మై అరైవింగు" అని పేరు పెట్టారు.

రమ లేచింది. "ఏమయితే అయింది. మానేజరు దగ్గరకు వెళ్తాను" అంది రమ.

"ఓకే. ట్రై యువర్ లక్!" అంది శశి. అంతా భయం భయంగా చూశారు.

రమ మేనేజర్ డోరు దగ్గరకొచ్చి తట్టింది. "కమిన్" అన్నాడు కామరాజు. రమ క్లుప్తంగా వివరించింది తను వచ్చిన పని. ఆ ముసలాయన ఒక రోజు తమ షాపులో చిన్న రిపేరు కూడా చేశాడని చెప్పడం మరువలేదు. కామరాజు నవ్వుతూ "సరే!

నావి అయిదు తీసుకోండి !" అని డబ్బు యిచ్చాడు.

సంతోషంతో గబగబా మెట్లు దిగి, "సక్సెస్ ! గ్రేట్ సక్సెస్ !" అని అరచుకుంటూ వచ్చింది రమ. శాంతకుమార్ దగ్గరకొచ్చి "ఏమండీ మంచి వెరైటీ ఆరో నంబరు చెప్పులు యీ ముప్ఫయ్ మూడు రూపాయలకీ తీసి యివ్వండి. బిల్లు మన శశి పేరిట వెయ్యండి !" అంది.

"నా పేరిట వద్దు. రమ పేరుతో వెయ్యండి" అంది శశి.

"పాక్ చెయ్యమంటారా?" కుమార్ అడిగాడు.

"వద్దు... అంతా యిక్కడే వుండండి. ఆయన రాగానే మనం సర్‌ప్రైజ్ చేద్దాం! ఏం ?" అంది రమ.

"అలాగే !" అన్నారందరూ.

శాంతకుమార్ జోళ్ళూ, బిల్లూ తెచ్చి రమ కిచ్చాడు. రమ డబ్బు శశి కిచ్చి బిల్లు మొత్తం జమ కట్టేసింది. అందరూ తలుపుదగ్గరే నిలబడి వున్నారు. పది కావస్తోంది. అతడి జాడ లేదు.

"తాతయ్యే మనల్ని సర్‌ప్రైజు చేసేట్టు న్నాడు" అన్నాడు సాంబమూర్తి.

"ఇదేంటండీ బాటిక్ వర్కా ?" అన్నాడు హాలు ఆ చివరనుంచి ఒక ఏకైక కస్టమరు.

"కాదండీ ! కలం కారీ వర్కు. కావాలా ?"

అతడు తలూపాడు. సాంబమూర్తి గొణు క్కుంటూ అటువేపు వెళ్ళాడు. కొత్త బట్టలు వేసుకుని ముఖంమీది చెమటను ముంజేతితో తుడుచుకుంటూ, సందు తిరిగి వస్తున్న 'పాకెట్‌మార్' గ్లాస్ డోర్‌లో నుంచి వాళ్ళకి కనిపించాడు.

"వచ్చేస్తున్నాడు" అంది రమ. అందరూ లేచి నించున్నారు. అతడు లోపలికి రాగానే "హాపీ బర్త్‌డే తాతయ్యగారూ !" అంది రమ ముందుగా అందరూ అతడితో కరచాలనం చేశారు. అందరూ అతడికి "హాపీ బర్త్‌డే" చెప్పారు.

"మీరు మాకు ఆదరణీయమైన కస్టమరు. మా అందరి తరఫునా యిది మీకు కానుక !" అంది రమ. అంతా గోలగా చప్పట్లు చరిచారు. ఈ గోల పైకి వినబడి, మేనేజరు గబగబా మెట్లు దిగి వచ్చాడు. ముసలాయన దగ్గరికొచ్చి, కరచాలనంచేసి, "స్వీకరించండి యీ కానుక!" అన్నాడు రమ అందించిన జోళ్ళను అతడికిస్తూ.

"ఒరే! ఒరే! మీరంతా ఎంత లాయల్ వర్కర్సురా! మీలాంటి వాళ్ళుంటే నేనెంతో గొప్పవాణ్ణి అయిపోయివుందును !" అన్నాడు



ఆనందంతో వుక్కిరిబిక్కిరి అయిన ముసలాయన. చిరునవ్వు నవ్వి, తల పంకించి, మానేజరు వెళ్ళిపోయాడు.

ఆయన మాటలకి అందరూ మళ్ళీ చప్పట్లు చరిచారు. ముసలాయన ఊపిరి పీల్చుకుని, కళ్ళనీళ్ళు తుడుచుకుని "వుండండి, వుండండి ! వన్ గుడ్ టర్న్ అని యింగ్లీషులో అంటారే — అలాగ, మీరు నాకు బహూమతి యిచ్చినందుకు, నేను మీకు బహూమతి యిస్తాను. మీకందరికీ, కాఫీ టిఫిన్లు యిప్పిస్తాను పదండి !" అన్నాడు.

"పదండి ! పదండి !" అన్నారు అందరూ.

"అమ్మాయ్ ! రమా ! మీ బావని కూడా రమ్మని ఫోనుచెయ్యి ! హోటల్ పాలెస్‌కు రమ్మని చెప్పు !" అన్నాడతడు.

"పాలస్‌కా ?" ఆశ్చర్యంతో అడిగింది రమ.

"ఈ ముసలివాడికి అన్నీ కాస్ట్లీ అలవాట్లు న్నట్టున్నాయి. అది ఫైవ్‌స్టార్ హోటల్. ఒక్కొక్కరికీ కాఫీ టిఫిన్లకే పదిరూపాయలు కావచ్చు !" అని శశికళ గొణిగింది రమ చెవిలో.

రమ అచేతనంగా బావకి ఫోన్ చేసింది. "పదండి, పదండి !" అని తొందరచేస్తున్నా డతను. "యాభై రూపాయలు తీసుకురా శశీ !" అని నిస్పత్తువగా అంది రమ.

"పాలెస్‌కా ?" అన్నాడు విక్టర్. అతడి ముఖం పాలిపోయి వుంది. "అర్జంటుగా నేను డిపార్టుమెంటులో ఇన్వెంటరీ చెయ్యాలండీ ! నేను రాలేను. సారీ !" అన్నాడు.

ఇలాగే ఒక్కొక్కళ్ళూ జారుకున్నారు. ముసలాయన వీధిన నడుస్తుంటే రమా, శశి మాత్రం వెంట నడిచారు. "యీ బిల్లులో కూడా భాగం పంచుకోవలసి వస్తుందని అందరూ వెళ్ళారు. పోనీలే, ఆయన దగ్గర డబ్బు లేకపోతే మనం యిద్దాం !" రమతో అంది శశి మెల్లగా. రమ నిట్టూర్చింది, "అలాగే" నంటూ.

ముసలాయన కొంతదూరం నడిచి, వెనక్కి తిరిగిచూసి, "ధర్మరాజు స్వర్గారోహణ చేస్తుంటే, అతడి వెంట ఒక కుక్క నడిచిందంట. మీరు ఇద్దరున్నారు !" అన్నాడు.

"అదేమిటండీ. మమ్మల్ని కుక్కలతో పోలుస్తున్నారన్నమాట !" అంది శశికళ నవ్వుతూ.

"కాదులే అమ్మాయ్ ! ఆకుక్క సామాన్యమైనదికాదులే !" అన్నాడాయన.

పాలెస్ హోటలు మెట్లెక్కుతోంటే బేరర్లందరూ అడ్డు తొలగి దారి యిచ్చారు వాళ్ళకి "చూశారా ! నాకెంత మర్యాద లభిస్తోందో ! అందరూ అడ్డం జరిగి, స్వాగతం చెప్తున్నారు !" అన్నాడాయన నవ్వుతూ.

"అది మీ గొప్పేం కాదులేండి ! మీ వెనక ఆడకూతుళ్ళం యిద్దరం వస్తున్నామని దారి యిస్తున్నారు" అంది శశికళ.

అతను బుర్రగోక్కుంటూ "అంతేనంటావా? ఇదంతా నాగొప్పే ననుకున్నానే !" అన్నాడు. హోలు కొసనవున్న ఒక రూములోనికెళ్ళి కూర్చున్నారు.

బేరరు వచ్చాక "మళ్ళీ కాసేపటికిరా !" అని ముసలాయన తరిమేశాడు. "చూడు రమా! మీ గోపాలం రావడానికి కాస్త ఆలస్యం కావచ్చు. కాబట్టి ఒక కథ చెప్తాను వినండి. ఏం శశీ ?" అన్నాడు.

"అలాగే" నన్నారు యిద్దరూ.

"ఒకసారి ఒకడు బొంబాయి వెళ్ళాడు. అక్కడ ఒక బట్టలమిల్లు వేలంవేస్తున్నారని తెలిసి చూద్దామని వెళ్ళాడు. మాసినగుడ్డ లేసుకుని, బటాణీలు నములుతూ ఒక మూల నిలబడిన అతణ్ణి ఎవ్వరూ గమనించలేదు. పాట వంద మూడు లక్షల వరకూ వచ్చి ఆగిపోయింది. అక్కడ పాటదారులంతా కుమ్మక్కయి వేసిన ఎత్తుగడ అది. నిజానికామిల్లు పాతిక లక్షలకి పైనే విలువ చేస్తుంది. బికారిలా వున్నాడని అన్నానే అతడు 'పధ్నాలుగు లక్షలు' అన్నాడు. అంతా విస్తుపోయారు. అయినా యీ బికారిరాముడేం కడ్తాడని వూర్కున్నారు. పాట అక్కడికి ఆగిపోయింది. అప్పుడు పధ్నాలుగు లక్షలకి చెక్కు యిచ్చి ఆ ఫాక్టరీ కొన్నాను !"

"మీరా !" అంది శశికళ.

"మీరా !" అంది రమ. "అంత డబ్బు..."

ముసలాయన నవ్వాడు. "ఆఁ ! నేనే... విను, మరి ! అక్కడితో అయిందా ! ఆ రాత్రి నా హోటలు గదికి ఒక వ్యాపారస్థుడు వచ్చి ఇరవై లక్షలకి అది నా దగ్గర్నుండి తీసుకున్నాడు ఒక్క రాత్రిలో ఆరు లక్షలు లాభం !"

"ఆరు లక్షలు !" అంది రమ.

"అబ్బ !" శశికళ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

తలుపు దగ్గర అడుగుల చప్పుడయింది. ముసలాయన తలెత్తి చూసి "రావోయ్ గోపాలం ! ఇప్పుడే అమ్మాయిలని రంజింపచెయ్యడానికి ఒక కథ చెప్తున్నాను. రా, కూర్చో !" అన్నాడు.

గోపాలం భయం, భయంగా లోపలికొచ్చాడు. "సార్, మీరు, మీరు..." అన్నాడు.

"నాకు తెలుసులే! నేను యీ హోటల్ ఓనరు రాంబాబునని తెలుసుకొని వుంటావని వూహించానులే ! రా కూర్చో! ఇవాళ నా బర్త్‌డే. అమ్మాయి నా కొక జోళ్ళజత, చందాలు పోగుజేసి, బహుమతిగా యిచ్చింది. నేనూ అమ్మాయి కొక బహూమతి యిస్తున్నాను. నీకు యిప్పుడే డెబ్బై వేలకి చెక్కు యిస్తున్నాను. నీకోసం కాదు. అమ్మాయికోసం. నీ గుణం కూడా నాకు నచ్చిందనుకో. అయితే యిది దానం కాదు. మూడేళ్ళలో ఈ సొమ్మంతా నువ్వు చెప్పినట్టు తీర్చేయాలి. అయితే అప్పు తీరేవరకూ పెళ్ళి చేసుకోకుండా కూర్చుంటానంటే ఒప్పుకునేది లేదు. రేపే, నీకూ మా అమ్మాయికీ రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళి. ఏమ్మాయ్ ? నీ కిష్టమేనా ?"

రమ నోటమ్మట మాటలు రాలేదు, శశి "కంగ్రాట్స్ రమా !" అంది.

రాంబాబు చిటికె వేశాడు. "బేరర్ ! డెబ్బై వేలకు గోపాలం పేరిట చెక్కు రాయించి తీసుకునిరా !" అన్నాడు. "బేరర్ వచ్చేంతలో మీకేం కావాలో ఆలోచించుకోండి ! ఈ 'పాకెట్‌మార్' ఎలా బిల్లు పే చేస్తాడని ఆందోళన పడకండి !" అన్నాడు.